بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ نَحْمَدُهٗ وَنُصَلِّی عَلٰی رَسُوْلِهِ الْکَرِيْمِ وَعَلٰی عَبْدِهِ الْمَسِيْحِ الْمَوْعُوْدِ

## Summary of Friday Sermon Huzur-e-Anwar 06.02.2015 (Telugu)

**ప్రపంచ దృష్టిని ఆకర్షించే విధముగా తమలో మార్పును కల్గించుకొనుము. మీ ధర్మబద్ధత, పవిత్రత, మీ దుఆల ఆమోదము, దైవముతో మీ సంబంధమును చూచి ప్రజలు ఇటు వైపు ఆకర్షితులై రావలెను. తమను తాము పనిలో నిమగ్నము చేసుకొనుట ఒక విశ్వాసుని కార్యము. ఒక గమ్యమును చేరుకొని మరో లక్ష్యమును అన్వేషించుటకు సంకల్పించవలెను.**

*హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 06.02.2015 తేదీన మస్జిద్ బైతుల్ ఫుతూహ్ - లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, తస్మియ, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ప్రసంగించిరి.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం పుస్తకములను చదువుటతో అనుకూల, ప్రతికూల ప్రభావములు పడును. మానవుడు ఏ ఆలోచనతో చదువునో దాని ప్రకారమే ప్రభావములు కలుగును. ఈ విషయము గురించి హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు తఆలా అన్‌హు ఒక సంఘటన ఇట్లు తెలిపిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంనకు మౌల్వీ ముహమ్మద్ అహ్సన్ అమ్రూహి గారిట్లు వినిపించిరి. మౌల్వీ బషీర్ అహ్మద్ గారు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను చాలా బలపరచేవారు. కాని నేను చాలా వ్యతిరేకించేవాడిని. బరాహీనె అహ్మదియ్య చదువవలెనని ఇతరులను మౌల్వీ బషీర్ అహ్మద్ గారు ప్రోత్సహించేవారు. ఈ పుస్తకము రచించిన వ్యక్తి సంస్కర్త (ముజద్దిద్) అని అనేవారు. తుదకు ఇతను సంస్కర్తనా కాదా అనే విషయములో చర్చించుకుందామని నేనన్నాను. కాని చర్చ పద్ధతి ఎట్లుండవలెననగా మీరు బలపరచు వారైనందున మీరు ప్రతికూల ధోరణితో చదువవలెను. నేను వ్యతిరేకి అయినందున అనుకూల ధోరణితో చదివెదను. 7,8 రోజులు పఠనమునకు నిర్ణయించుకొన్నాము. ఇరువురు పుస్తకములను చదివినాము. వ్యతిరేకి అయిన నేను అహ్మది అయినాను. కాని బషీర్ అహ్మద్ గారి హృదయము నుండి విశ్వాసము దూరమైనది. దీని గురించి తన అభిప్రాయమును తెలుపుచు హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు తఆలా అన్‌హు ఇట్లనిరి. ఆత్మ విద్యా ప్రకారము చర్చలు చాలా నష్టము కలిగించును. కొన్ని సార్లు అపార నష్టము వాటిల్లును. ఇవి చాలా సూక్ష్మమైన సమస్యలు. ప్రతి ఉపాధ్యాయుడు వీటిని బోధించు అర్హత కలిగివుండడు. మంచి విషయములలో కూడ విమర్శాంత్మక ధోరణితో భావము తీయుటకు ప్రయత్నించినప్పుడు అదే ధర్మభ్రష్టమునకు కారణమగును. మేము హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పుస్తకములను చదివినాము, అది వ్రాసి యుంది, ఇది వ్రాసి యుందని కొందరు విమర్శింతురు. ఎందుకనగా వారు విమర్శించుటకే చదివెదరు. సందర్భానుసారము వాక్యమును కలిపి చూడరు. ఇదేదో క్రొత్త విషయము

కాదు. విమర్శకులు దైవ శాసనమును కూడ విమర్శింతురు. అందుకే పవిత్ర ఖుర్‌ఆన్ గురించి కూడ అల్లాహ్ స్వయముగా ఇట్లు నుడివెను. విశ్వాసులకు ఇది స్వస్థత, కరుణామయము, కాని క్రూరులైన విమర్శకులకు ఇది నష్టము కలిగించును. కనుక పవిత్ర హృదయముతో చదవనంత వరకు దైవ శాసనమైనను ఎలాంటి ప్రయోజనము కలిగించలేదు.

నమాజ్ (ప్రార్థన) ప్రాముఖ్యత గురించి హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక సంఘటనను హ్రజత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు ఇట్లు తెలిపిరి. వాజ్యము నడుచుచుండగా నమాజ్ సమయమయ్యెను. ప్రజలు నివారించినా వారు నమాజ్ కొరకు పోయిరి. పోయిన తర్వాత వాజ్యము కొరకు పిలువబడిరి. కాని వారు నమాజ్‌లో నిమగ్నమై యుండిరి. చట్టము ప్రకారము న్యాయమూర్తి వారికి విరుద్ధముగా తీర్మానము ఏకపక్షముగా చెప్పవలసియుండెను. అల్లాహ్‌కు వారి ఈ కార్యము ఎంతగా నచ్చినదనగా ఆ న్యాయమూర్తికి వారు ప్రార్థన చేయుచున్నారని శ్రద్ధ కలిగెను. వారి హాజరు కాకున్నను వారి లేదా వారి తండ్రి పక్షమున తీర్మానము చెప్పెను. వారి స్వంత వాజ్యములు లేకుండెను. ఆస్థి పాస్థుల వాజ్యములు యుండెడివి. తప్పని పరిస్థితిలో తండ్రి తరపున హాజరయ్యేవారు.

మరోచోట సామూహిక (బా జమాఅత్) నమాజ్ ప్రాముఖ్యత గురించి హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సంఘటనను హ్రజత్ ముస్లిహ్ రజియల్లాహు అన్‌హు తెలిపిరి. ఏ విధముగా మనము సామూహిక నమాజ్ అలవాటు చేసుకోవలెను. హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం నమాజ్‌నకు మస్జిద్‌కు వెళ్లలేని సందర్భములలో గృహములోనే సామూహిక నమాజ్ ఏర్పాటు చేసేవారు. ఎప్పుడో ఒక్క సారి అనివార్య పరిస్థితిలో విడిగా నమాజ్ చేసేవారు. కనుక మొదట మిత్రులు నమాజ్ సామూహికంగా చదువవలెను. ఈ అవకాశము లభించనివారు తమ భార్య, పిల్లలతో కలిసి సామూహిక నమాజ్ చదువవలెను. పెద్ద నగరములో మిత్రులు దూర, దూర ప్రాంతాలలో యుంటున్నచో ఒక్కో వీధి వారు అచట సామూహికము కొరకు ఏర్పాట్లు చేసుకోవలెను. మస్జిదులు లేని చోట మస్జిదులు నిర్మించుకొనుటకు ప్రయత్నించవలెను.

సామూహిక నమాజ్ ప్రాముఖ్యత ఏమనగా ఇంట్లో కూడ పిల్లలతో కలిసి నమాజ్ చదువుము. తద్వారా పిల్లలకు కూడ సామూహిక నమాజ్ ప్రాముఖ్యత తెలియును.

నమాజ్‌ను తన పూర్తి నిబంధనలతో చదువవలెనని హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఆదేశించిరి. నమాజ్‌ను పూర్తి శ్రద్ధతో చదువుటలోయే దాని అందము గలదని హ్రజత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు అనిరి. గింజలు తినుటకు కోడి తల నేలకు కొట్టినట్లే కొందరు నమాజ్ చదివెదరు. ఇటువంటి నమాజ్‌తో ఎలాంటి ప్రయోజనము కలుగదు. కొన్ని సార్లు ఇటువంటి నమాజ్ శాపమునకు కారణమగును.

క్రింది సిబ్బంధి సలాం చేయరని ఒక సారి హ్రజత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) నకు ఫిర్యాదు అందినది. అందుకు వారీ విధముగా ఉపదేశించిరి. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఒక ఆజ్ఞను ఒక సోదరుడు పాటించనిచో మనమే స్వయముగా దానిని పాటించవలెను. సలాం చిన్న వారే చేయాలి పెద్దలు వారు చేయకూడదని ఎక్కడ లేదు. క్రింది వ్యక్తి చేయనిచో అధికారి స్వయముగా చేయవలెను.

ఇటువంటి విషయములలో అధికారులు విమర్శించే బదులు స్వయముగా ఆదర్శముగా నిలువవలెను. సలాం చేయుటలో ముందంజ వేయుము. జమాఅత్‌లోని ప్రతి దశలవారు సలాంను అలవరచుకోవలెను. ఇది హదీస్‌లో కూడ గలదు.

ఒక వాజ్యములో న్యాయమూర్తి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను తప్పక శిక్షించవలెనని సంకల్పించెను, అతనితో వాగ్దానము కూడ తీసుకోబడెను. ఈ సంఘటనను ప్రస్తావించుచు హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఒక చోట నేపథ్యము తెలుపుచు ఇట్లనిరి. ఒక సారి ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం జనాభా లెక్కలు చేయించిరి. శత్రువు మమ్ములను అంతము చేయుననే ఉద్దేశముతో వారు సల్లల్లాహు అలైహి వసల్లం జనాభా లెక్కలు చేయించిరని అనుచరులు భావించి ఇట్లనిరి. ఓ రసూలుల్లాహ్! సల్లల్లాహు అలైహి వసల్లం ఇప్పుడు మన సంఖ్య ఏడు వందలకు చేరినది. మనలను ఇప్పుడెవరైనా అంతము చేయగలరని ఊహించగలమా! ఇది ఎంత గొప్ప విశ్వాసము! ఏడు వందలైనందుకు శత్రువు అంతము చేయలేదని వారు నమ్మిరి. విశ్వాసపు శక్తి గొప్పదని వారు (రజి) అనిరి.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సంఘటన ఇట్లు గలదు. వారు గుర్దాస్‌పూర్‌లో యున్నప్పుడు ఖ్వాజా కమాలుద్దీన్ గారు ఇతర అహ్మదీయులు చాలా భయపడి వచ్చి ఇట్లనిరి. వాజ్యము యున్న న్యాయమూర్తి లాహోర్ వచ్చెను. మిర్జా గారు మన ధార్మిక గట్టి శత్రువులైనందున ఒక్క రోజు కొరకు అయినను తప్పక శిక్షించవలెను. ఇది నీ జాతి సేవ అగునని ఆర్యులు అనిరి. నేను తప్పక శిక్షింతునని అతడు వాగ్దానము చేసి వచ్చెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అప్పుడు పరుండి ఈ విషయము వినిరి. లేచి మోచేయిపై పరుండి ఖ్వాజా గారు! మీరెలా మాట్లాడుచున్నారు. అల్లాహ్ పులిపై ఎవడు చేయి వేయగలడు. అల్లాహ్ ఆ న్యాయమూర్తిని మొదటగా శిక్షించుచు గుర్దాస్‌పూర్ నుండి బదిలీ చేసెను. తర్వాత హోదా తగ్గించి ఇ.ఎస్.సి నుండి మున్సిఫ్ గా చేయబడెను. వేరే న్యాయమూర్తి వచ్చి తీర్పు చెప్పెను. విశ్వాసపు శక్తి చాలా గొప్పది. దానిని ఎవరు ఎదురించలేరు.

ఈ వాజ్యము గురించే మరో చోట వారింకా ఇట్లనిరి. హుజూర్! న్యాయమూర్తి తప్పక బంధించును, శిక్షించును. కనుక వైరి వర్గముతో సంధి కుదుర్చుకొనుట ఉత్తమమని ఖ్వాజా కమాలుద్దీన్ గారనిరి. మోచేతుల సహాయముతో కూర్చొని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. ఖ్వాజా గారు! అల్లాహ్ పులిపై చేయి వేయుట సులభము కాదు. నేను అల్లాహ్ పులిని. అతడు నాపై చేయి వేసి చూడమను. ఇటులనే జరిగెను. ఈ తీర్పు కొరకు నియమించబడిన ఇద్దరు న్యాయమూర్తులలో ఒకరి కుమారుడు పిచ్చివాడయ్యెను. నీవు ఒక ముస్లిం సజ్జనున్ని అవమానించినందున నీ ఒక కుమారుడు పిచ్చివాడయ్యెనని అతని భార్య అనెను. ఇప్పుడు రెండవ వాని కొరకు జాగ్రత్త పడుము. అతడు ఇటు వైపు శ్రద్ధ వహించలేదు. అతని రెండవ కుమారుడు రావి నదిలో స్నానము చేయుచుండగా అతని ఒక కాలును మొసలి కొరికెను. ఈ విధముగా అతడు అంతమయ్యెను. ఆ న్యాయమూర్తి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంను చాలా ఇబ్బందికి గురి చేయుచు వాజ్యము కొనసాగుచుండగా వారిని నిలబెట్టేవాడు. దాహము కలిగినచో అనుమతించేవాడు కాడు. రెండవ న్యాయమూర్తి కూడ తొలగించబడెను. వీరిరువురు చాలా క్రూరులుగా

నుండిరి. వారు తమ అంతమును కూడ చవిచూసిరి. ఇవి అల్లాహ్ తమ సందేశహరుల సత్యమును ప్రపంచములో బహిర్గతపరచు స్పష్టమైన సంకేతములని హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) అనిరి.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఈ సంఘటన వినిపించేవారని హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. ఒక సారి రుస్తమ్ ఇంటికి దొంగ వచ్చెను. అతడు దొంగను పట్టుకొనుటకు ప్రయత్నించెను. అతనికి కలాయి పట్టు వచ్చును. కనుక అతడు రుస్తమ్‌ను క్రింద పడేసెను. నేను హతమార్చబడుదునని రుస్తమ్ భావించినప్పుడు రుస్తమ్ వచ్చెనని అనెను. ఈ విషయము విని దొంగ వెంటనే పారిపోయెను. అనగా దొంగ రుస్తమ్‌తో పోరాడెను, కాని అతని పేరు వినగానే భయపడి పారిపోయెను. కొందరు అపోహలు కలిగించినందున ప్రజల ధైర్యము తగ్గిపోవునని దీని ఆధారముగా వారు తెలిపిరి. కనుక తమ ధైర్యము, సాహసమును స్థిరపరచుకొనుటకు అపోహలను నిలువరించి, వాటిని ఎదురించవలసి యుండును.

కరమ్ దీన్ వాజ్యము గురించి వారిట్లనిరి. వారి విజయము ప్రారంభమగుటకు ఈ ప్రయాణము మొదటి సంకేతముగా నుండెను. వారొక వాజ్యమునకు హాజరగుచుండిరి. అయినను ఊహకందని ప్రజల భారి సమూహముండెను. వారు జీహ్‌లుమ్ స్టేషన్‌లో దిగినప్పుడు ప్లాట్ ఫారమ్ మీద నిబడుటకు స్థలము లేకుండెను. స్టేషన్ బయట కూడ దూర దూరము వరకు ప్రజలు గుంపులుగా వున్నందున బండి కదులుటకు ఇబ్బందిగా యుండెను. సుమారు వెయ్యి మంది ఇక్కడ బైఅత్ చేసిరి. వారు న్యాయస్థానము పోయినప్పుడు వాజ్యము వినుటకు ఎంత మంది వచ్చినారనగా న్యాయస్థానము ఏర్పాట్లకు కష్టపడెను. మొదటి సారే వారు నిర్దోషులుగా ప్రకటించబడి సురక్షితముగా తిరిగి వచ్చిరి. ఆ తర్వాత జమాఅత్ ప్రగతి ఆశ్చర్యకర రీతిలో మొదలైనది. కొన్ని సార్లు ఒక్కొక్క రోజు ఐదదు వందల మంది బైఅత్ ఉత్తరములు వ్రాసేవారు. వారి అనుచరుల సంఖ్య వేలను దాటి లక్షలకు చేరెను. అన్ని రకాల వారు వారి హస్తమున బైఅత్ చేసిరి. వారి జీవితములోనే ఈ సంస్థ అతి వేగముగా వ్యపించసాగినది. పంజాబ్ దాటి ఇతర రాష్ట్రములు, దేశములకు వ్యాపించడం మొదలైనది.

అవమానమునకు అల్లాహ్ ఎట్లు శిక్షించును. ఒక న్యాయమూర్తి సంఘటన వినిరి. మరో సంఘటన ఇట్లు వివరించిరి. సరిహద్దులకు చెందిన ఒక మౌల్వీ అబ్దుల్ కరీం మన జమాఅత్‌నకు బద్ధశత్రువుగా యుండెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక సంఘటనను అతడు అతి అవమానకరముగా ప్రస్తావించెను. దైవ సందేశహరుడని ప్రకటించుకునే ఇతడు ఢిల్లీ పర్యటించినప్పుడు మిర్జా హైరత్ పోలీస్ ఇన్స్‌పెక్టర్‌గా అతని వద్దకు పోయెను. అతడు భవనముపై కూర్చొని యుండెను. వాస్తవానికి ఇది కూడ అబద్ధమే. అప్పుడు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం క్రింద వరాండాలో కూర్చొని యుండిరి. మౌల్వీ అబ్దుల్ కరీం హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గురించి ఇట్లనెను. పోలీస్ ఇన్స్‌పెక్టర్ విషయము అతడు వినగానే భయపడి మెట్ల నుండి దిగుచు కాలు జారి పడిపోయెను. ప్రజలు ఈ ఉపన్యాసమును విని చాలా హాస్యించిరి. కాని అదే రోజు అల్లాహ్ మౌల్వీ అబ్దుల్ కరీంను శిక్షించెను. అతడు తన ఇంటి పైన నిద్రించుచుండెను. రాత్రి ఏదో పని కొరకు లేచెను. ఆ ఇంటికి కంటె గోడ లేకుండెను నిద్ర వలన అతని కనులు తెరుచుకోలేదు. అతని ఒక కాలు కప్పు బయట పడి ఒక్క సారిగా క్రింద పడి

అక్కడికక్కడే మృతి చెందెను. దైవ సందేశహరులను అవమానించే వారి అంతము ఏమగునో అను విషయము అతన్ని చూసిన వారికి స్పష్టమైనది. నేడు ప్రజలు ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లంను అవమానించు ధోరణిని అవలంభించుచు అమర్యాదగా వ్యవహరించుచున్నారు. వారు సల్లల్లాహు అలైహి వసల్లం అల్లాహ్‌కు అతి ప్రియమైన సందేశహరులు. వారి గురించి ప్రజల అవమానములను విస్మరించునా ? అల్లాహ్ ఇటువంటి వారిని ప్రపంచములో కూడ గుణపాఠముగా చేయును. కనుక మనము మన బాధలను దుఆలలో మార్చవలెను. ఈ రోజులలో ప్రత్యేక దుఆలు చేయవలెను.

ఈ సంఘటనను తెలుపుచు హ్రజత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు ఇంకను ఇట్లనిరి. ప్రపంచ దృష్టిని ఆకర్షించే విధముగా తమలో మార్పును కల్గించుకొనుము. మీ ధర్మబద్ధత, పవిత్రత, మీ దుఆల ఆమోదము, దైవముతో మీ సంబంధమును చూచి ప్రజలు ఇటు వైపు ఆకర్షితులై రావలెను. ఇటువంటి వారితోనే అహ్మదియ్యత్ అభివృద్ధి చెందును. మీరు ఈ స్థానమునకు లేదా దీనికి సమీపములో చేరినను మీరు ఒక్క అడుగు బయట వేయకున్నను గుప్తముగా మూలకు కూర్చున్నను అక్కడ కూడ ప్రజలు మీ చుట్టు చేరుదురు. అహ్మదియ్యత్‌లో ప్రవేశింతురు. అన్షాఅల్లాహ్

మరో సంఘటనను ప్రస్తావించుచు వారిట్లనిరి. హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సియాల్కోట్ పోయిరి. వారి ఉపన్యాసము వినుటకు పోయిన వారి వివాహము రద్దు అగునని మౌల్వీలు తీర్మానించిరి. కాని మిర్జా గారి ఆకర్షణ వలన ప్రజలు దీనిని లెక్క చేయలేదు.

హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి ఒక విధేయులైన అనుచరులు హ్రజత్ మౌల్వీ బుర్హానుద్దీన్ గారుండిరి. వారి గురించి ఇట్లు తెలిపిరి. అహ్మదీ కాక ముందు వారు వహాబీల ప్రముఖ విద్యావంతులై యుండిరి. ఏదియును ఆశించే స్వభావికులు కారు వారు. వారిని చూచి విద్యావంతులని ఎవరు భావించరు. నాకు వారి ఒక హాస్య సంఘటన సదా గుర్తుండును. హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సియాల్కోట్ పోయినప్పుడు అక్కడ తీవ్ర వ్యతిరేకత ఎదురైనది. తిరిగి వచ్చిన తర్వాత ఎవరెవరు అహ్మదీయులని విరోధులకు తెలిసినదో వారి వారిని బాధించడం మొదలు పెట్టిరి. మౌల్వీ బుర్హానుద్దీన్ గారు కూడ స్టేషన్ నుండి తిరిగి పోవుచుండిరి. ప్రజలు పేడ తీసుకొని వారిపై వేయడం మొదలు పెట్టిరి. హద్దులు దాటుచు ఒకడు పేడను వారి నోట్లో పెట్టెను. కాని వారు చాలా ఆనందముతో ఈ బాధను భరించుచుండిరి. వారిపై పేడ వేయబడినప్పుడు ఎంతో ఆనందముతో ఈ రోజులు, ఈ ఆనందములు ఎక్కడివని అనేవారు. కథకుని ప్రకారము వారి నుదుటిపై ఏ మాత్రం బాధ లేకుండెను.

వారు అహ్మదీ అగుటకు కారణమైన ఒక విచిత్ర సంఘటన వారు వినిపించేవారు. ఆరంభములో హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక గదిలో ఏదో వ్యాసము వ్రాయుచు వేగంగా నడుచుచుండగా వారు చూచిరి. వారు ప్రపంచములో ఏదో ఘన కార్యము చేసి తీరుతారని వారి హృదయములో నాటుకపోయెను. వేగముగా పని చేయడంతో సమయములలో చాలా తేడా ఏర్పడునని హ్రజత్ ముస్లిహ్ మౌవూద్ అన్నారు. తొందర పడు వాడు షైతాన్ అయినను ఆలోచించి వివేకముతో వేగంగా పని చేయువాడు దైవ సైనికుడగును. త్వరగా పని చేయు, త్వరగా ఆలోచించు అలవాటు పిల్లలకు కలిగించవలెను. త్వరగా అనగా తొందర కాదు. ఆలోచించుచు పని చేయవలెను. కనుక పెద్దలు, హెూదాదారులు కూడ తమ పనులను వేగంగా చేయవలసిన అవసరమున్నది. సమయమునకు విలువనిచ్చి పని చేసిన మసీహ్‌ని మనము విశ్వసించువారము. వారి సమయము

వృధా చేయబడదని అల్లాహ్ సువార్త వాణి ద్వారా తెలిపెను. ఇటువైపు మనము శ్రద్ధ వహించవలెను.

మృత్యువుతో భయపడు వారిని శత్రువు భయపెట్టునని వివరించుచు వారు (రజి) జిహ్‌లుమ్‌కు చెందిన మౌల్వీ బుర్హానుద్దీన్ గారి సంఘటనను తెలిపిరి. వీరు మృత్యువుతో భయపడుతారు కనుక మనము వీరిని భయపెట్టుదామని శత్రువు అనును. పవిత్ర ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇట్లనును. షైతాన్ తన మిత్రులను భయపెట్టును. భయపడు వాడు షైతాన్‌కు చెందిన వాడని శత్రువు భావించును. కాని అతడు భయపడక ఆ దాడులను, బాధలను అల్లాహ్ బహుమానములుగా భావించి అల్లాహ్ తన అనుగ్రహముతో నాకీ గౌరవము ప్రసాదించినాడు, నన్ను కరుణించినందున అతని కొరకు దెబ్బలు తింటున్నానని అన్నచో శత్రువు భయాందోళనకు గురై తుదకు పశ్చత్తాపపడును.

మౌల్వీ బుర్హానుద్దీన్ గారి గురించి మరో సంఘటన గలదు. వారొక సారి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వద్దకు వచ్చి ఇట్లనిరి. నేను స్వప్నములో మృతి చెందిన నా సోదరిని చూచినాను. అక్కడ నీ స్థితి ఎట్లున్నదో చెప్పు సోదరి అని అన్నాను. ఆమె ఇట్లనెను. అల్లాహ్ ఎంతగానో కరుణించి నన్ను క్షమించెను. ఇప్పుడు నేను స్వర్గములో సుఖంగా యున్నాను. అక్కడ ఏమి చేయుచున్నావు సోదరీ అని నేనడిగితని. ఆమె ఇట్లనెను. ఇది కూడ ఒక హాస్యమే. రేగి పండ్లు విక్రయించుచున్నానని ఆమె అనెను. నేను స్వప్నములోనే ఇట్లన్నానని మౌల్వీ బుర్హానుద్దీన్ గారనిరి. మన అదృష్టము కూడ చాలా విచిత్రమైనది. స్వర్గములో కూడ రేగి పండ్లే అమ్ముదుమా? వారి కుటుంబములో బీదతనము యున్నందున స్వప్నములో కూడ అటే ఆలోచన మల్లినది. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. రేగి పండు స్వర్గపు ఫలము. తరగని ప్రేమకు నిర్వచనమది. ఎందుకనగా తరగని ప్రేమకు సిద్ర (ఉన్నత) స్థానము సూచిక. అల్లాహ్ తరగని ప్రేమను ప్రజలలో సోదరి పంచునని దీని పారాయణము. మరల వారిట్లనిరి. విశ్వాసుడు ఎక్కడున్నా పని చేయవలయును. మీరు పని ముగించుకున్న తర్వాత మరింత కష్టపడి తమ ప్రభువు వైపు పరుగిడుమని అల్లాహ్ నుడివెను. సదా గుర్తుంచుకోవలసిన రహస్యమేమనగా ప్రాపంచిక ప్రజలు విశ్రాంతి అని భావించిన రూపంలో మీకు విశ్రాంతి లేదు. ఆ భావనలో ఎవరు విశ్రాంతిని కోరినా అతడు ఈ లోకములో అంధునిగా యుండును, పరలోకములో కూడ అంధునిగానే యుండును.

తమను తాము పనిలో నిమగ్నము చేసుకొనుట ఒక విశ్వాసుని కార్యము. ఒక గమ్యమును చేరుకొని మరో లక్ష్యపు అన్వేషణకు సంకల్పించవలెను. ఇదే వ్యక్తిగత, జాతీయ ప్రగతికి సూచిక, రహస్యము. ఇందుకు అల్లాహ్ మనలను అనుగ్రహించుగాక! (ఆమీన్)

✡ ✡ ✡

*Translated By : Hafiz Syed Rasool Niyaz, For : Telugu Desk*

From: Nazarath Nashr-O-Isha'ath, Qadian, Distt:Gurdaspur, Pin:143516, Punjab